epaper.manachourasta.com

శుక్రవారం, 26 సెప్టెంబర్ 2025

మన చౌరాస్తా

సంపుటి : 02 | సంచిక : 137



# చీటకోడూరుకు జలకళ

- జిల్లాలో జోరుగా వానలు

**జనగామ జిల్లాలో** గత కొన్ని రోజులు కురుస్తున్న వర్షా లకు జిల్లాలో పలు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు పలు మండలాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. జనగామ మండలంలోని చిటకోడూరు డ్యాం గేట్లు ఎత్తడంతో యశ్వంతపూర్ వాగు పరవాళ్లు తొక్కుతోంది. శుక్రవారం ఉదయం వరకు వివధ మండలాల్లో కురిసిన వర్ష పాతం ఇలా ఉంది. జిల్లాలో జాఫర్గఢ్ మండలంలో అత్యధికంగా 106.4 మిల్లీమీటర్ల వర్షం పడింది. దేవరుప్పలలో 77.6, పాలకుర్తి 68.8, జనగామ 44.6, లింగలఘణపురం 42.6, నర్మెట 34.6, చిల్పూర్ 33.3, తరిగొప్పుల 30.4, రఘునాథపల్లి, 30.6, స్టేషన్‌ఘన్‌పూర్ 29.6, బచ్చన్నపేట 22.4, కొడకండ్ల 8.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వానల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# కొత్త మద్యం షాపులకు నోటిఫికేషన్

- నేటి నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
- అక్టోబర్ 23న డ్రా పద్ధతిలో దుకాణాల కేటాయింపు
- టెండర్ ఫీజు రూ.3 లక్షలు.. ఆరు విడతల్లో చెల్లింపు

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణలో కొత్త మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదలైంది. శుక్రవారం నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అక్టోబర్ 23వ తేదీన డ్రా పద్ధతిలో మద్యం దుకాణాలు కేటాయించనున్నారు. కొత్త దుకాణాలకు 2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 వరకు లైసెన్స్ కాల పరిమితిగా నిర్ణయించారు. అలాగే టెండర్ ఫీజును రూ.3 లక్షలుగా నిర్ణయించారు. గతంలో టెండర్ ఫీజు రూ.2లక్షలు ఉండగా.. ఇప్పుడు ఒక లక్ష అదనంగా పెంచుతూ మూడు లక్షలుగా తేల్చారు. అలాగే ఫీజు మొత్తాన్ని ఒకేసారి కాకుండా ఆరు విడతలుగా చెల్లించే వెసులుబాటు కల్పించారు. ఇక ప్రస్తుతం ఉన్న మద్యం దుకాణాల లైసెన్స్‌గడువు నవంబర్30తో ముగియనుంది. అలాగే ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం శిక్ష పడిన వారు మద్యం దుకాణాలు పొందడానికి అనర్హులుగా పరిగణించబడతారు. రాష్ట్రంలోని 2,620 మద్యం దుకాణాల్లో గౌడ్‌లకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు ఉంటాయి.

## జనగామ రిజర్వేషన్లు ఖరారు

జనగామ జిల్లాలో నూతన మద్యం దుకాణాల టెండరు ప్రక్రియ మొదలుకానుంది. వైన్స్ కేటాయింపు కోసం




రిజర్వేషన్ల ప్రాసెస్ గురువారం పూర్తి చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 47 మద్యం దుకాణాలు ఉండగా ఈ సారి మరో మూడు కొత్త దుకాణాలు పెరగడంతో మొత్తం సంఖ్య 50కి చేరింది. వీటిలో జనరల్ కేటగిరీ(ఓపెన్) విభాగంలో 31, ఎస్టీ వర్గానికి 1, ఎస్సీ సామాజిక వర్గానికి 5, గౌడ కులస్థులకు 13 మద్యం దుకాణాలను లాటరీ



ద్వారా కేటాయించారు. గురువారం ఇన్‌చార్జి కలెక్టర్ పింకేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కేటాంపులు జరిగాయి. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ అధికారి ప్రేమకళ, బీసీ వెల్ఫేర్ అధికారి ఎన్.ఎల్. నర్సింహారావు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.విక్రమ్, ఎక్సైజ్ సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

- వారంలో ఒక రోజు శ్రమదానం చేయాలి
- ఇన్‌చార్జి కలెక్టర్ పింకేష్ కుమార్

2లో




# పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

- వారంలో ఒక రోజు శ్రమదానం
- ప్రలకు ఇన్‌చార్జి కలెక్టర్ పింకేష్ కుమార్ పిలుపు



**జనగామ, మన చౌరాస్తా :** ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని, వారంలో ఒక రోజు శ్రమదానం చేపట్టి స్వచ్ఛతాహి సేవకు బాసటగా నిలవాలని ఇన్‌చార్జి కలెక్టర్ పింకేష్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ కార్యక్రమం అమలులో భాగంగా జనగామ మండలం శామీర్‌పేటలో నిర్వహించిన ఏక్ దిన్ ఏ గంట ఏక్ సాత్ అనే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కలిసి ఇన్‌చార్జి కలెక్టర్ ఒక గంట పాటు శ్రమదానం చేశారు. అనంతరం జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ గ్రామంలో దేవీ నవరాత్రులని జరుపుతున్న సందర్భంలో ఏర్పాటు చేసిన మండపంలో ఇన్‌చార్జి కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. తదనంతరం గ్రామ ప్రజలందరి చేత స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పింకేష్ కుమార్ మాట్లాడుతూ కనీసం వారంలో మీ కోసం మీరు మీ ఇంటిలో మీ వాడలో ఒక గంట పాటు శ్రమదానం చేస్తే అది మీ ఇంటి ఆరోగ్యానికి సోపానం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రత కోసం శ్రమదానం చేపట్టి స్వచ్ఛత పాటించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. గ్రామ పారిశుద్ధ్య కార్మికులకి కలెక్టర్ శాలువాలచే సన్మానం చేసి ప్రత్యేకంగా అభినందిస్తూ స్వచ్ఛతాహి సేవ టీ షర్ట్స్, క్యాప్స్ అందించారు. అంతకుముందు జిల్లా పంచాయతీ అధికారి స్వరూప , జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ కోఆర్డినేటర్ కరుణాకర్ , జిల్లా అదనపు పీడి చంద్రశేఖర్ , ఎంపీడీవో సంపత్ , పంచాయతీ కార్యదర్శి స్వప్న ఇన్‌చార్జి కలెక్టర్ కు స్వచ్ఛ బతుకమ్మతో స్వాగతం పలుకుతూ స్వచ్ఛ బతుకమ్మ ఆట ఆడి స్వచ్ఛత నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏపీఎం శంకరయ్య , గ్రామ ప్రజలు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.





## సాగునీటి సమస్యలను పరిష్కరించాలి : యశస్విని రెడ్డి

**హైదరాబాద్, మన చౌరాస్తా :** పాలకుర్తి నియోజకవర్గ రైతులకు సాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర పౌరసరఫరాల, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో జరిగిన ఈ భేటీ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి ప్రాంతంలో వర్షపాతం నమోదైనప్పటికీ చెక్‌డ్యామ్‌లు నిండకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాగునీటి కొరత కారణంగా పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం జనగామ జిల్లా, కొడకండ్ల మండలంలోని హాట్యా తండాలోని కాకతీయ కెనాల్ వద్ద స్లూయిస్ గేట్ (ఓటీ) ఏర్పాటు చేసి నీటిని మళ్లించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. నీటి మళ్లింపు వల్ల లాభాలు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వివరించినట్లుగా ఈ ఓటీ ఏర్పడితే పాలకుర్తి నియోజకవర్గంలోని పోచారం, బొమ్మకల్, కర్కాల, చికటాయపాలెం గ్రామాల్లోని చెక్‌డ్యామ్‌లు నిండిపోతాయని, చెక్‌డ్యామ్‌లు నిండితే సాగునీరు లభించి, రైతుల పంటలు రక్షించబడటమే కాకుండా వారి ఆర్థిక పరిస్థితి కూడా బలోపేతం అవుతుందని ఆమె స్పష్టం చేశారు. మంత్రి హామీరైతుల సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మా దృష్టికి తీసుకొచ్చిన ఈ ప్రతిపాదనను సమగ్రంగా పరిశీలించి, తక్షణ చర్యలు తీసుకుంటాం అని ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి హామీ ఇచ్చారు.

## స్థానిక ఎన్నికలపై అధికారులకు శిక్షణ




**వరంగల్, మన చౌరాస్తా :** కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విధులను నిర్వర్తించనున్న రిటర్నింగ్ అధికారులకు, సహాయ రిటర్నింగ్ అధికారులకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు, జిల్లా శిక్షణ నోడల్ అధికారి ఆధ్వర్యంలో గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ... రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూ.చ. తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వహించాలని హితవు పలికారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ప్రతి అధికారి పూర్తి నిబద్ధతతో పని చేయాలని అన్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన తక్షణమే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావాలని, అభ్యర్థులు ఎన్ని నామినేషన్లు సమర్పించిన వాటిని పూర్తిగా పరిశీలించి, ఆమోదించినవి, తిరస్కరించినవి, తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా ప్రకటించాలని సూచించారు. సమయపాలన కచ్చితంగా పాటించాలని,ఎన్నికలు పూర్తిగా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించి పోలింగ్, కౌంటింగ్ సమయంలో సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డిప్యూటీ సీఈఓ , జిల్లాలోని ఎన్నికల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం

**హనుమకొండ, మన చౌరాస్తా :** ఈ 27 ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా హరిత కాకతీయలో పర్యాటక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం.శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఉత్సవాల్లో భాగంగా హరిత కాకతీయలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటుగా బతుకమ్మ థీమ్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని విద్యాశాఖ సహకారంతో హనుమకొండ జిల్లా పరిధిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పర్యాటక రంగం మీద వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు హరిత కాకతీయలో నిర్వహించే ఉత్సవాల్లో విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందిస్తామని ఎం.శివాజీ తెలిపారు.

## నిజాయితీగా పని చేయాలి

**హనుమకొండ, మన చౌరాస్తా :** ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్ రావు గురువారం వరంగల్ సీపీ క్యాంప్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలకు పోలీసులపై ఉన్న నమ్మకానికి తగ్గట్లుగా పని చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని నూతన ఇన్‌స్పెక్టర్ కు సూచించారు.



# చోరీల నియంత్రణకు ప్రత్యేక బృందాలు

## వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



**హనుమకొండ, మన చౌరాస్తా :** చోరీలకు పాల్పడిన నిందితులను పట్టుకొనేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, వారిని అరెస్ట్ చేసి నిందితుల నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నప్పుడే ప్రజలకు పోలీసుల పట్ల నమ్మకం, గౌరవం పెరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్అధికారులకు సూచించారు. నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్అధికారులు పాల్గొన్న ఈ సమీక్షా సమావేశంలో సీపీ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండిరగ్‌లో ఉన్న కేసులను సమీక్ష జరిపడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు కేసుల పరిష్కారం కోసం అధికారులు తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ చోరీలకు పాల్పడిన నిందితులను పట్టుకోవడం కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయడంతో పాటు నిందితులు దేశంలో ఎక్కడ వున్న అరెస్టు చేసేందుకు పోలీస్అధికారులు ప్రణాళికను రూపోందించుకోవాలని, కేసుల్లోని నిందితులను అరెస్టు చేయడంలో స్టేషన్అధికారులు అలసత్వం వహించొద్దని, నేరాల నియంత్రణకై పోలీస్‌స్టేషన్‌పరిధిలో ప్రజల భాగస్వాయ్యంతో సిసి కెమెరాల ఏర్పాటుకై కృషి చేయడంతో సిసి కెమెరాల వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా నిందితులకు కచ్చితంగా శిక్ష పడే రీతిలో పోలీస్అధికారులు దర్యాప్తు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో ఈస్ట్‌జోన్‌డిసిపి అంకిత్‌కుమార్, వరంగల్, జనగాం ఏఎస్పీలు శుభం, చేతన్‌నితిన్, అదనపు డిసిపిలు రవి, ప్రభాకర్‌రావు, బాలస్వామి, సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్.ఐలు పాల్గొన్నారు.

## పత్తి రైతులను ఆదుకోవాలి

**వరంగల్, మన చౌరాస్తా :** సీసీఐకి రైతులు పత్తి పంట అమ్మే విషయంలో పరిమితులు విధించడాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్య రాణిని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సోమిడి శ్రీనివాస్, సోమ రామమూర్తి మాట్లాడుతూ...ఇప్పటికే విదేశీ నుండి దిగుమతి చేసుకునే దూదిపై 11శాతం సుంకాన్ని ఎత్తివేయడం రైతులకు శాపంగా మారిందని, పత్తి క్వింటాకు 12 వేల రూపాయల మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పత్తి తేమ శాతాన్ని 12 శాతం నుండి 16 శాతానికి పెంచి పంట కొనుగోలు చేయాలని, రైతులు పత్తిని అమ్మే సమయంలో స్లాట్ బుకింగ్ అనే విషయాన్ని తొలగించాలని కోరారు. సంఘ ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, కోశాధికారి రవీందర్, అంబయ్య లు పాల్గొన్నారు.

# భూసమస్యలు పరిష్కరించాలి

## అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** అదనపు కలెక్టర్ బెన్ స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లి గ్రామంలో గురువారం ఆకస్మికంగా సందర్శించి సాదా బైనామా, భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ, అసైన్డ్ భూముల 22A ను పరిశీలించారు. అనంతరం కార్యాలయంను సందర్శించి అధికారులతో సమీక్షించారు. సాదా బైనామ కొరకు నోటీస్‌లు ఇచ్చారా, సమస్యల పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలను సంబంధించిన వివరాలను ఆడిగి తెలుసుకున్నారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. భూములను తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తర్వాతనే నిర్ణయాలు తీసుకోవాలని, తదనంతరం సాదా బైనామ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట స్టేషన్ ఘన్పూర్ ఆర్డీఓ డి.ఎస్.వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





### అంగన్ వాడీల్లో బతుకమ్మ వేడుకలు..

**జనగామ మండలం గానుగుపహాడ్ అంగన్ వాడీ కేంద్రం-1లో గురువారం పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఉయ్యాల పాటలతో ఆటలాడారు. కార్యక్రమంలో టీచర్ శ్రీదేవి, ఏఎన్ఎం శారద, ఆశా వర్కర్ ఇందిర, సునిత పాల్గొన్నారు. అలాగే మండలంలోని మరిగడి అంగన్‌వాడీ కేంద్రం-1లో కూడా పోషణ మాసోత్సవాల్లో భాగంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సాంబరాజు సుజాత, ఆయా కె.అనసూర్య, గర్భిణులు, కిషోర బాలికలు, బాలింతలు పాల్గొన్నారు.**

*- మనచ చౌరాస్తా, జనగామ రూరల్*



## స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో విస్తృత పర్యటన

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** స్టేషన్‌ఘనపూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.ఎస్. వెంకన్న గురువారం చిల్పూర్ మండలంలోని చిన్న పెండ్యాల, పాలకుర్తి మండలంలోని బొమ్మెర, కొడకండ్ల మండలంలోని రేగుల గ్రామాలను సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా సాదాబైనామ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో మాట్లాడుతూ... సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనలో రెవెన్యూ సిబ్బంది పూర్తిగా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఎలాంటి ఆరోపణలకు తావివ్వకుండా వ్యవహరించడమే కాకుండా, 2014 జూన్ 2వ తేదీ లోపు తెల్ల కాగితాలపై కొనుగోలు చేసిన వ్యవసాయ భూములు గల అర్హ రైతులను గుర్తించి పూర్తి నివేదికలు సమర్పించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్లు నాగేశ్వర్ రావు, చంద్రమోహన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా దీన్ దాయల్ జయంతి

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు ఆధ్వర్యంలో భారతీయ జనసంఘ్ అధ్యక్షులు పండిత్ దీన్ దాయల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆ మహానీయుడు ఈ దేశానికి చేసిన సేవలను స్మరిస్తూ, ఆయన చిత్రానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఒక విశిష్ట జాతీయవాద రాజకీయ ఆలోచనాపరుడు, తత్వవేత్త, ఆర్థికవేత్త, సామాజిక శాస్త్రవేత్త మరియు భారతీయ సంస్కృతి మరియు సంప్రదాయాలను విశ్వసించే వ్యక్తిగా గుర్తింపు పొందారు. కార్యక్రమంలో బీజేపీ హుస్నాబాద్ పట్టణ ఉపాధ్యక్షులు వేల్పుల నాగార్జున్, బోడిగే వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు గాదాసు రాంప్రసాద్, పోలోజు రాజేందర్ చారీ, కార్యదర్శులు వడ్డెపల్లి లక్ష్మయ్య, బొప్పిశెట్టి సాయిరామ్, బీజేపీ సీనియర్ నాయకులు తోట సమ్మయ్య, వరియోగుల అనంతస్వామి, కాంసాని లక్ష్మణ్, బోనగిరి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

### పరకాలలో..

**పరకాల :** దీన్ దయాల్ ఉపాధ్యాయ 109వ జయంతి వేడుకలు జరిపిన బిజెపి పరకాల పట్టణ శాఖ గురువారం పరకాల బీజేపీ కార్యాలయంలో పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. సిరంగి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ... "దీనదయాళ్ ఉపాధ్యాయ్ సూత్రం అంత్యోదయను ప్రధాని నరేంద్ర మోదీ విజయవంతంగా అమలు చేస్తున్నారు.








# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

## మంత్రి పొన్నం ప్రభాకర్







**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలం ములకనూరు లో మార్పటి సుధ అశోక్ రెడ్డి,మార్పటి జలంధర్ రెడ్డి ల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి శుభా కాంక్షలు తెలిపారు.అనంతరం భీమదేవరపల్లి మండలానికి సంబంధించిన కళ్యాణి లక్ష్మీ ,షాది ముబారక్ లబ్ధదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కొత్తపల్లి గ్రామంలో జాతీయ రహదారి పై సెంట్రల్ లైటింగ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పథకమైన ఎక్కడ ఇబ్బందులు లేకుండా ఈ పథకాన్ని నిరటకంగా కొనసాగిస్తుంది అని అన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని ఇళ్ల నిర్మాణాలు వేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. మిగిలిన వారికి ఫేజ్ 2 కింద 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం, అర్హత ఉన్న వారందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం అని అన్నారు. ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకుపోతున్నామని అన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్లు హైమావతి, స్నేహ శబరీష్, అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్, ఆర్డీవో రమేష్ రాథోడ్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటును

# అడ్డుకోవడం సరికాదు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** అక్కన్నపేట మండల లోని గోవర్ధనగిరి గ్రామంలో గత ఐదు సంవత్సరాల క్రితం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికై భూమి పూజ చేసిన అప్పటి ప్రజా ప్రతినిధులు ఈరోజు కావాలనే గద్దెను కూల్చే ప్రయత్నం చేస్తున్నారు దీనిని మా అంబేద్కర్ సంఘం రాష్ట్ర కమిటీ పక్షాన వీరిపైన ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని ప్రకాష్ మాట్లాడారు. అదేవిదంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా ఈ దేశం ఇన్ని సంవత్సరాలు ప్రజాస్వామ్యం బద్దంగా నిలకడగా ఎలాంటి అవకతవకలు లేకుండా పాలన జరుగుతుంది .అంబేద్కర్ దేశంలోని అన్ని వర్గాలకు, అన్ని మతాలకు, అన్ని కులాలకు కావలసిన హక్కులను, జీవించే హక్కు, స్వేచ్ఛ, సమానత్వంగా ఉండాలి అందరి కోసం తను రాయడం జరిగినది, అలాంటి మహానుభావుని విగ్రహాన్ని పెట్టనీయకుండా అడ్డుకోవడం చాలా దారుణం ఇప్పటికైనా స్థానిక అన్ని వర్గాల ప్రజలు ఇదే గద్దెపై అంబేద్కర్ గారి విగ్రహాన్ని ప్రతిష్టించాలని అంబేద్కర్ సంఘం రాష్ట్ర కమిటీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కండె సుధాకర్, తొందూరి ఎల్లయ్య, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో అసిస్టెంట్ ఇంజినీర్

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండలో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో ఏసీబీ సోదాలు జరుగుతున్నాయి. కొడకండ్లలో స్కూల్ భవనం బిల్లుల మంజూరు కోసం రూ. 18 వేలు లంచం అడిగి..గురువారం రూ.8వేలు తీసుకుంటుండగా అసిస్టెంట్ ఇంజినీర్ రమేశ్ ఏసీబీకి పట్టుబడ్డారు. గతంలో రూ.10వేలు తీసుకున్నట్లు సమాచారం. జనగామ డీఈవో ఆఫీస్లో రమేశ్ పని చేస్తున్నాడు.



# పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

## ▫ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

**పరకాల, మన చౌరాస్తా :** పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు, దామెర, నడికూడ, పరకాల టౌన్ మండలాలకు చెందిన అర్హులైన 70 మంది లబ్ధిదారులకు 20 లక్షల 50వేల రూపాయల చెక్కులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిలుస్తుందని, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు కనీసం సీఎంఆర్ఎఫ్ నిధులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెండింగ్ వాటిని కూడా మంజూరు చేసామన్నారు. అలాగే 200 యూనిట్ల ఉచిత కరెంట్, 500 రూ గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, డైట్ చార్జీల పెంపు, సన్న బియ్యం పంపిణీ,తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నమన్నారు.

